# కొంటె కోణంగి



ఈ రోజుల్లో స్కూల్‌మాస్టర్ ఉద్యోగం చేయడంకన్నా, చెప్పులు లేకుండా ముళ్లకంపల మీద నడవడం తేలిక. అదీ... కాలేజీ లెక్చరర్ ఉద్యోగం అయితే ఇంక చెప్పనక్కరలేదు- కత్తి మీద సామే! బ్రతిమిలాడితే లోకువయిపోతారు. బెదిరిస్తే వీపు కాసుకోవలసి వస్తుంది. ముందు నుయ్యి, వెనుక గొయ్యిగా ఉంటుంది వాళ్ళ పని. దీనికితోడు- విద్యార్థులు వేసే చిక్కుప్రశ్నలు, తిక్కప్రశ్నలు అన్నీ తట్టుకొని, వాటికి చమత్కారంగా జవాబులు చెప్పి తప్పించుకోగలిగినవాడే ధన్యుడిగా బయటపడతాడు.

రంగనాథంగారు ఈ చిక్కులన్నింటినీ తప్పించుకొని ధైర్యంగా విద్యార్థుల ముందు నిలబడగలిగాడు. 'ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్'... అన్నట్లు- మొదటిలోనే మంచి అభిప్రాయం కలిగించగలిగితే, ఆ లెక్చరర్‌ని విద్యార్థులు నెత్తిన పెట్టుకొని ఆరాధిస్తారు. ఈ విషయంలో విజయం పొందడంతో- ఆయన అచిరకాలంలోనే విద్యార్థులకు అత్యంత ప్రీతిపాత్రుడయ్యాడు.

పైగా... ఆయన పాఠం చెప్పే తీరులోనే ఒక ప్రత్యేకత ఉంది. పాఠాన్ని పాఠంగా కాకుండా, యాంత్రికంగా చెప్పుకుపోకుండా... చిట్టి కథలు, పొట్టి కథలు, పిట్ట కథలు, జోక్సుతో ఇష్టాగోష్టి సమావేశంలాగా నడుపుతాడు. అందుకే ఆయన క్లాసులో ఎప్పుడూ ఫుల్ అటెండెన్సు ఉంటుంది. అయితే... ఆయన ఇచ్చే చనువువల్ల విద్యార్థులు కూడా కొంటె ప్రశ్నలు వేయడం, ఛలోక్తులు విసురుతుండడం పరిపాటి. వాటిని ఆయన ఎప్పుడూ సీరియస్‌గా తీసుకునేవాడు కాడు. వాటికి తగిన సమాధానాలు అంతకంటే కొంటెగా చెప్పి, వాళ్ళని నోరు ఎత్తకుండా చేసేవాడు.

ఆడపిల్లల్లో విజయ మహా కొంటెపిల్ల. కనిపించకుండా అల్లరి చేసేది. రంగనాథంగారంతటి వాడిని కూడా ఆట పట్టించాలని చూసేది.

రంగనాథంగారు వేషం కూడా విచిత్రంగా వేసుకుంటూ ఉండేవాడు. ఓరోజు పైజామా, దాని పైన స్వెట్టర్ వేసుకుని వచ్చేవాడు. ఇంకోరోజు బొడ్డుపైకి పోయిన బనీను వేసుకుని, గుండీలు ఊడిపోయిన చొక్కాతో వచ్చేవాడు. మరోరోజు సాగిపోయిన బనీను చేతులు- చొక్కా చేతుల్లోంచి బయటకు వ్రేలాడుతుంటే, అండర్‌వేర్ బొందు తాడు బయటపడుతున్నా గమనించుకోకుండా ఉండేవాడు. ఓరోజు తల దువ్వుకోవడం మరిచిపోయి, మరోరోజు షూస్‌లో సాక్స్ వేసుకోవడం మరచి వచ్చేవాడు. అయితే మనిషి ఎలా ఉన్నా- మాట చాతుర్యం ఉన్నవాడు కావడం వల్ల, ఎవ్వరూ విమర్శించేవారు కాదు.

ఆరోజు రంగనాథంగారు పైజామా వేసుకుని, దాని మీద ప్యాంట్ వేసుకుని వచ్చాడు. అయితే ప్యాంట్ కొంచెం పొట్టిగా ఉండడం వల్ల పైజామా కాళ్ళు బయటకి వచ్చి కుక్క చెవుల్లా వేలాడుతూ కనిపించసాగాయి. రంగనాథంగారు బ్లాక్‌బోర్డు దగ్గరకు వెళ్లి ఏదో చెప్తూ రాస్తుంటే- అవి ప్రస్ఫుటంగా కనిపించసాగాయి. ముందు బెంచీలోనే ఉందేమో... విజయ కంటికి అవి మరీ ప్రస్ఫుటంగా కనిపించాయి.

ఆ దృశ్యం చూస్తుంటే ఆమెకి నవ్వాగలేదు.

నోటికి చెయ్యి అడ్డు పెట్టుకొని నెమ్మదిగా ప్రక్కనున్న విద్యార్థినులతో-

"చూశారా... ఇవాళ మాస్టారు లంగా వేసుకొని వచ్చారు" అంది.

తోటి విద్యార్థినులు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

విజయ నెమ్మదిగానే అన్నా- ఆ మాటలు రంగనాథంగారి పాముచెవులలో పడ్డాయి.

అవి విని తనలో తానే నవ్వుకున్నాడు.

బోర్డు మీద వ్రాయడం పూర్తి అయ్యాక తిరిగి టేబుల్ దగ్గరికి వచ్చాడు.

"మనం ఎవరితోనైనా మాట్లాడుతుంటే లేక మనతో ఎవరైనా మాట్లాడుతుంటే- మనం వారి ముఖంవంక చూడాలి. లేదా ఏదైనా చూపిస్తుంటే దానివంక చూడాలి. అంతేకాని- కాళ్ల వంకా, గోళ్ల వంకా చూడకూడదు. అయితే... ముఖం వంక చూసి మాట్లాడలేని సందర్భాలు కూడా కొన్ని ఉంటాయి. ఉదాహరణకు... భార్య, భర్త ముఖం వంక చూసి మాట్లాడడానికి బిడియపడ్తుంది. అందువల్ల పతి వంక కాని, పతిగా భావించుకొనేవారిని చూసినప్పుడు కాని మాత్రమే వారి పాదాల వంక చూడాలి. ఇతరుల విషయంలో నిర్భయంగా ముఖం వంక చూడవచ్చు" అన్నారు రంగనాథంగారు.

అంతే... విజయ గతుక్కుమంది.

ఆ మాటలు ఆయన ఎందుకు అన్నారో అర్థంచేసుకున్న విద్యార్థుల నవ్వులతో హాలు దద్దరిల్లింది.

- భారత మిత్రం... *18* డిసెంబర్ *'77*



గోడు

ఒక తండ్రి మిత్రుని దగ్గర తన గోడు ఇలా వెళ్లబోసుకున్నాడు-

"మా పెద్దవాడికి గడ్డం పెంచడమంటే ఇష్టం. వద్దురా- రోజూ చక్కగా గడ్డం చేసుకో- అంటున్నానని నా మీద కోపం. మా రెండోవాడికి ఇంకా గడ్డమే రాలేదు. అయినా రేజర్ పెట్టి గీక్కుంటానంటాడు. వద్దంటున్నందుకు వీడికి కోపం. ఇలా అఘోరిస్తుంటే ఎలా చావాలి?"